క్లుప్తంగా

కూరగాయల సంత వేలం

నింద్ర: మండల కేంద్రంలోని వారపు కూరగాయల సంత వేలం సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ధరణి తెలిపారు. మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ కూరగాయల సంత వేలం తీసుకున్న వారు ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలో మాత్రమే కూరగాయలు వ్యాపారం చేయాలని కోరారు. రోడ్డు పక్కన విక్రయాలు చేయరాదని సూచించారు. వ్యాపారులు గమనించాలని కోరారు.

పాఠశాల తనిఖీ



తరగతి గదిని పరిశీలిస్తున్న ఎంఈవో నమశ్శివాయం

నగరి: పట్టణ పరిధిలోని ప్రైవేటు పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి నమశ్శివాయం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్ కరెక్షన్స్‌పై ఆరాతీశారు. పాఠశాలలో బోధన విధానాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు తరగతి గదిలో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గంగాధర నెల్లూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.భాస్కర్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఘనంగా జయలలిత జయంతి వేడుకలు



జయలలిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐఏడీఎంకే నాయకులు

నగరి: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత 76వ జయంతి వేడుకలను స్థానిక ఏఐఏడీఎంకే నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర కార్యదర్శి ఆంబ్రోస్ విల్సన్ ఆధ్వర్యంలో పుదుపేటలో జయలలిత, ఎంజీఆర్ చిత్రపటాలకు పూజలుచేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. జయలలితతో పార్టీ నాయకులకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముత్తుకుమరన్, నాయకులు కె.గోపి, శంకర్‌రాజు, సురేష్ రెడ్డి, బాబునాయుడు, గోవిందస్వామి, షణ్ముగం, పాండు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన



వృద్ధులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న డాక్టర్ మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి మోహన్ క్రిష్ణ తెలిపారు. ఆయన శనివారం పీహెచ్‌సీలో వృద్ధులు, గర్భిణులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత పెరిగిందన్నారు. మధ్యాహ్నం వడగాడ్పులు వీచే అవకాశం ఉందని, ఎండకు బయట తిరగరాదన్నారు. ఓఆర్ఎస్, మజ్జిగ ఎక్కువగా తాగాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్ఞానశేఖర్, పీహెచ్ సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

శరవేగంగా కల్వర్టు నిర్మాణ పనులు

నగరి: మున్సిపల్ పరిధి భీమానగర్‌లో కల్వర్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పుదుపేట, ఏకాంబరకుప్పంలోని వార్డుల్లో రూ.1.2 కోట్ల నిధులతో జరిగే అభివృద్ధి పనుల్లో భాగంగా కల్వర్టు నిర్మాణ పనులు సాగుతున్నాయి. స్థల వివాదాల కారణంగా రెండు దశాబ్దాల పాటు కాలువలు, కల్వర్టులు, రోడ్లు లేక అవస్థపడిన స్థానిక ప్రజలు మంత్రి ఆర్కే రోజా చొరవతో సమస్యలన్నీ పరిష్కృతమై అభివృద్ధి పనులు చకచకా జరుగుతుండడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లప్ప రెడ్డి చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను డీఈ నరేష్, ఏఈ నవీన్, కౌన్సిలర్లు భూపాలన్, చిత్ర పరిశీలించారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్

కార్వేటినగరం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీడీఎం ఆధ్వర్యంలో ముస్లిం, క్రిస్టియన్ విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తున్నట్లు తిరుపతి శ్రీప్రజ్ఞ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సి.మల్లీశ్వరి తెలిపారు. అలాగే ప్రముఖ ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ హరిబాబు నిర్వహించే మోటివేషన్ తరగతుల స్టడీ మెటీరియల్‌ను కూడా అందజేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి కల వారు డీఎస్సీ దరఖాస్తు, రేషన్ కార్డు, ఆధార్, టీఈడీ, డీఈడీ సర్టిఫికెట్లతో రెండు రోజుల్లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 7382753550, 9912377296లో సంప్రదించాలని కోరారు.

సమగ్ర భూ సర్వే ఒక మహాయజ్ఞం

- దేశంలోనే ఇదే ప్రథమం
- వందేళ్ల తర్వాత రీసర్వేకు శ్రీకారం
- ఇది జగనన్న నేలమీద రాసిన చరిత్ర
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా



భూ పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి ఆర్కే రోజా



పన్నూరులో బస్‌షెల్టర్ ప్రారంభిస్తున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం: సమగ్ర భూ రీసర్వే ఒక మహాయజ్ఞమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. మండలంలోని పన్నూరు దళితవాడలో శనివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. భూ యజమానులకు శాశ్వత పట్టాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న 58 నెలల పాలనలో ప్రతి సమస్యకూ శాశ్వత పరిష్కారం చూపారని స్పష్టం చేశారు. అవినీతి అక్రమాలకు తావు లేకుండా సరైన రెవెన్యూ రికార్డులను అందించాలన్న లక్ష్యంతో ఈ సమగ్ర సర్వేను చేపట్టినట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,461 గ్రామాల్లో 1.07 కోట్ల రైతులు, 2.47 కోట్ల సర్వే నెంబర్లకు సంబంధించి 2.26 కోట్ల ఎకరాల వ్యవసాయ భూముల్లో సర్వే చేపట్టినట్లు చెప్పారు. దీంతో పాటు 13,371 గ్రామ కమతాల్లో 85 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు.. 123 పట్టణ ప్రాంతాల్లో 40 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు సంబంధించి సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

శతాబ్దం తరువాత రీసర్వే

ఇలా రాష్ట్రంలోని అన్నిరకాల భూములను రీ సర్వే చేయడం వందేళ్ల తరువాత మొదలైందని మంత్రి తెలిపారు. భూ సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో ఈ సర్వే కొనసాగుతోందని చెప్పారు. ఒక్క రూపాయి కూడా రైతు వద్ద తీసుకోకుండా హద్దు రాళ్ల నాటడం వరకు ఉచితంగానే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన గొడవలు, కోర్టు కేసుల్లో ఎక్కువ శాతం భూములకు సంబంధించినవే ఉండడంతో జగనన్న భూ రీసర్వే ద్వారా వాటికి పరిష్కారం చూపుతున్నారన్నారు. రైతుకు కన్నతల్లితో పేగు బంధం ఉంటే, నేలతల్లితో సాగు బంధం ఉంటుందన్నారు. అలాంటి భూమి రికార్డుల్లో ట్యాంపరింగ్, అక్రమాలు జరగకుండా ప్రతి ఒక్క కమతానికి నిర్దిష్టంగా గుర్తింపు నంబరు ఇస్తూ, క్యూఆర్ కోడ్‌తో ల్యాండ్ మ్యాప్ సిద్ధం చేయడం అంటే ఆషామాషీ కాదని చెప్పారు. ఇకపై నకిలీ రిజిస్ట్రేషన్లకు, లంచాలకు అవకాశం లేకుండా చేస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఒకవైపు పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తూ...మరో వైపు అసైన్డ్ భూములకు పేదలకు హక్కులు కల్పిస్తూ, సాగు భూములకు పక్కా రికార్డులు అందిస్తున్నారని గుర్తు చేశారు. అందరూ చరిత్రను కాగితాల్లో రాస్తే జగనన్న నేలపై రాస్తున్నారన్నారు. జగనన్న పేదల పక్షం అని ఎందుకు చెబుతున్నారో అందరికీ నేడు అర్థమవుతోందని చెప్పారు. ఇన్నాళ్లూ, ఈ రాష్ట్రం క్యాపిటలిజం, కమ్యూనిజం, నక్సలిజం, సోషలిజం చూసిందని నేడు జనం కోసం మేలు చేసే జగనిజం ఎలా ఉంటుందో చూస్తోందన్నారు. జగనన్న చేసింది...చంద్రబాబు ఎందుకు చేయలేదో జనం తెలుసుకోవాలన్నారు. జగనన్న దళితులకు భూములను పంపిణీ చేస్తే... చంద్రబాబు అమరావతిలో దళితుల భూములను కాజేశారని చెప్పారు. అందుకే నేడు జగనన్న భూపంపిణీ చేసిన బాంధవుడిగా నిలిస్తే, చంద్రబాబు భూములు కాజేసే బకాసురుడయ్యారని ఎద్దేవా చేశారు. మన పేదలకు విద్య, వైద్యం, సేద్యం, గూడు, నీడ, భూమి హక్కు వంటివన్నీ ఇస్తున్న జగనన్నని మళ్లీ గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

అభివృద్ధికి చిరునామా వైఎస్సార్‌సీపీ

రాష్ట్ర అభివృద్ధికి చిరునామా వైఎస్సార్‌సీపీ అని క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. మండలంలోని ఎల్లసముద్రం, పన్నూరులో శనివారం ఎంపీ నిధుల ద్వారా మంజూరైన రూ. 2.5 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వమూ ఇప్పటివరకు ప్రజావసరాలను తీర్చే ప్రక్రియను చేపట్టలేదన్నారు. జగనన్న ఆలోచనలు ఎప్పుడు ప్రజాసేవపైనే ఉండడంవల్లే ఈరోజు సచివాలయ వ్యవస్థ పుట్టుకొచ్చిందన్నారు. పన్నూరు, ఎల్ల సముద్ర గ్రామ ప్రజలు మంత్రిని గజమాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ బాలాజీ, ఆర్‌బీకే చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, కన్వీనర్ గోపి, ఎంపీటీసీ గోవిందమ్మ, సర్పంచ్ కుమార్, మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజ్‌గోపాల్, రాము, మహేష్, బాలాజీ, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

పుత్తూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శనివారం వడమాలపేట మండలం పూడిలో నిర్మించిన గ్రామ



ఆర్‌బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రోజా

సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు, తాగునీటి పైపులైను, డ్రైనేజీ, సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఒక్క పూడి గ్రామంలోనే సుమారు కోటి రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మండల కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పనులు జరిగేవి కావని గుర్తు చేశారు. జగనన్న పాలనలో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను పెట్టి ఇంటి వద్దనే సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అందరికి మంచి చేస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ లాలూచీ రాజకీయాలతో జత కట్టారని, జగనన్న మాత్రం సింహంలా సింగిల్‌గానే వస్తారని స్పష్టం చేశారు. ప్రజలకు మరింత మంచి చేయడానికి జగనన్న సిద్ధంగా ఉన్నారని, రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేసిన చంద్రబాబు, లోకేష్ ఈసారి గెలిచే పరిస్థితి కూడా లేదని వివరించారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పానికి సైతం నీరు అందించలేకపోయారని విమర్శించారు. జగనన్న ప్రభుత్వంలో కుప్పాన్ని మున్సిపాలిటీగా, రెవెన్యూ డివిజన్‌గా అభివృద్ధి చేశారని తెలిపారు. ఈనెల 26వ తేదీన కుప్పం వస్తున్న జగనన్న అక్కడి ప్రజల చిరకాల కోరికైన సాగు, తాగునీటిని హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, మొత్తం 175 స్థానాలను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజసింహనరేంద్ర, ఏడీఏ రమేష్‌రాజు, డాక్టర్ చక్రపాణి, సర్పంచ్ కుసుమ, వైఎస్సార్‌సీపీ నేతలు యాదవేంద్రరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, రేణుక, లోకేష్‌రెడ్డి, ఉపేంద్ర, చంద్రారెడ్డి, రామిరెడ్డి, సుధీర్‌రెడ్డి, సురేష్‌రాజు, నందయ్య, మదనమోహనరెడ్డి, శ్రీవిద్య, కమల, రవిరెడ్డి, అయ్యప్పరెడ్డి, మునిబాబు, బాబు, కిరణ్, వెంకట్‌రెడ్డి, రాజశేఖర్, జయంతిబాబు, వేణు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి



మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర కోరారు. స్థానిక కోర్టులో పోలీసులతో శనివారం సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులను రాజీ చేయాలని సూచించారు. నగదుతోపాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతోపాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీమార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమం అని, దీనిపై అప్పీల్ వెళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పుత్తూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా కేసులను సమీక్షించి తగిన సూచనలు చేశారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, పుత్తూరు డీఎస్పీ వై.శ్రీనివాసరావు, సీఐలు ఓబులేసు, భాస్కర్‌నాయక్, ఎస్‌ఐ పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యస్వామి కల్యాణం



వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి కల్యాణం చేస్తున్న అర్చకులు

గంగాధర నెల్లూరు: మండలంలోని వింజం పంచాయతీ సిద్ధేశ్వర కొండలో వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కల్యాణం జరిపించారు. కొండ కింద ఊరు గ్రామానికి చెందిన సంపూర్ణమ్మ నరసింహారెడ్డి దంపతులు, సుగుణమ్మ జయరాం రెడ్డి దంపతులు, బాబు రెడ్డి కుమారి దంపతులు, బుజ్జమ్మ వెంకట్ రెడ్డి దంపతులు, బుజ్జమ్మ చంగల్రాయ రెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ రామక్క గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయానికి కుంభాభిషేకం



సీతారాముల మూలవిరాట్‌లు



మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం(విజయపురం): విజయపురంలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయానికి శనివారం వైఖానస ఆగమోక్తంగా మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. పుత్తూరు సిద్ధార్థ గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ అశోకరాజు ఆలయాన్ని నిర్మించారు. గురువారం ఉదయం అంకురార్పణతో ప్రారంభమైన ఉత్సవంలో శనివారం మధ్యాహ్నం ఆలయ శిఖరంపై కలశాన్ని స్థాపించి కుంభాభిషేకం నిర్వహించారు. అశోకరాజు మాట్లాడుతూ తన అవ్వ, తాతల జ్ఞాపకార్థం ఆలయాన్ని నిర్మించామని అన్నారు. ఆలయంలో సీతారాములవారు, లక్ష్మణ, ఆంజనేయ, హైగ్రీవ, వేణుగోపాలస్వామి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. మూడు రోజులపాటు ఆలయ మహాకుంభాభిషేక ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. మహాకుంభాభిషేక కార్యక్రమంలో అశోకరాజు దంపతులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలోని శ్రీ వరదరాజుల స్వామి ఆలయంలో శనివారం శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతాన్ని ఆలయ అర్చక వేదపండితులు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఉదయం మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజుల స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణ స్వామి అలంకరణలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్యనారాయణ వ్రతంను నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో వ్రతంను ఆచరించారు.

తాడేపల్లె గూడేనికి వరసిద్ధుని ప్రచారరథం

వరసిద్ధి వినాయక స్వామి ప్రచార రథం శనివారం ఉదయం కాణిపాక ఆలయం నుంచి తాడేపల్లె గూడేనికి బయలుదేరి వెళ్లింది. తాడేపల్లె గూడెం పరిసర ప్రాంతాల్లో స్వామివారి విశిష్టతను చాటి చెప్పేందుకు ఈ ప్రచార రథాన్ని వినియోగిస్తున్నారు. ఆలయం నుంచి సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి రథంలో కొలువు తీర్చారు. అనంతరం ప్రచార రథానికి ప్రత్యేక పూజలు చేసి సాగనంపారు.

గడప వద్దకే వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సందీప్

శ్రీరంగరాజపురం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల గడప వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ సందీప్ తెలిపారు. ఆయన శనివారం స్థానిక సర్పంచ్ మల్లికమ్మ ఆధ్వర్యంలో ఏఎంపురం గ్రామ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ సందీప్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై అవగాహన కల్పించారు. 96 మందికి వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొంది విశ్రాంతి తీసుకుంటున్న వారిని పరిశీలించి సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందించారు. .

చెరకు సాగులో మెలకువలు పాటించాలి



చెరకు పంటకు ఆశించే తెగులపై వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పాలసముద్రం: చెరకు, వరి సాగులో మెలకువలను పాటిస్తే అధిక దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని ప్రిన్సిపల్ సైంటిస్ట్ సుమతి, సాయిల్ సైంటిస్ట్ వజంత తెలిపారు. వారు శనివారం రాచపాల్యంలో చంద్రశేఖర్ రాజు సాగు చేసి చెరకు పంటను పరిశీలించారు. వారు మాట్లాడుతూ చెరకులో కలుపు నివారణ, సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్ పద్ధతిలో తక్కువ నీటితో ఎక్కువగా చెరకు సాగు చేసుకోవచ్చని తెలిపారు. చెరకు తోటలో గట్లపై కొబ్బరి మొక్కలు పెంచుకోవచ్చన్నారు. కొబ్బరి మొక్కలను ఆశించిన తెల్లగొన నివారణ గురించి వివరించారు. వరిపంటలో డ్రమ్ సీడర్ పద్ధతిలో పంటసాగు చేసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్, ఠాగూర్, వీఏఏ నెడిజెలన్, ఎంపీఈవో శంకర్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి



అగరంలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏవో

నింద్ర: వరి, వేరుశనగ పంటలకు ఆశ్రయించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండలంలోని అగరం, చవరంబాకం గ్రామాల్లో శనివారం వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. వేరుశనగ పంటలకు ఆశించిన పచ్చపురుగు, లద్దెపురుగుల నివారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం చైర్మన్ వీరయ్య, వ్యవసాయ సిబ్బందితోపాటు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మలింగేశ్వరుడికి పౌర్ణమి పూజ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీరంగరాజపురం: మండల కేంద్రమైన శ్రీరంగరాజపురం సమీపంలోని పల్లేరుకోనలో వెలసిన ఆత్మలింగేశ్వరస్వామికి శనివారం ఘనంగా పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం పాలాభిషేకం చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త మోహన్‌నాయుడు, స్థానిక సర్పంచ్ హరిత, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కుప్పయ్య, నాయకులు ఎన్‌ఆర్‌ఐ భాస్కర్‌రెడ్డి, దేవ, రాజేంద్ర, తిరుమల, చంద్ర, కందస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ ధనుంజయ

కార్వేటినగరం: విద్యార్థులకు ఇంటర్మీడియట్ కీలకమని కార్వేటినగరం బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రి తెలిపారు. పాఠశాలలో శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు సరస్వతి పూజ చేపట్టారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం బాలికల కోసం ఉన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి కళాశాలను ఏర్పాటు చేసిందని మొదటి సంవత్సర ఫలితాల మీదే అడ్మిషన్లు జరుగుతాయన్నారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థి దశలో ఇంటర్ కీలకం

పాలసముద్రం: విద్యార్థి దశలో ఇంటర్ కీలకమని, బాగా చదివితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని జెడ్పీటీసీ అన్బలగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. ప్రిన్సిపల్ ధనుంజయ మాట్లాడుతూ మార్చి 1 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. టెన్షన్ పడకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ-2 పుష్పప్రకాష్, అధ్యాపకులు సూరియన్, వినాయకం, షణ్ముగం, రమ్య, శోభ, సుశీల, శ్రీనివాసులు గౌండర్, బాలక్రిష్ణ, భారతి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంకాలేశ్వరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు, బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పండితులు





ఆలయాల్లో పౌర్ణమి ప్రత్యేక పూజలు

పాలసముద్రం: మండలంలోని రాపాల్యంలో వెలసిన బాలగురునాథీశ్వరస్వామి, వెంగళరాజు కుప్పం సమీపంలో వెలసిన అంకాలేశ్వరమ్మ ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బాలగురునాథీశ్వరస్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అంకాలేశ్వరమ్మను అలంకరించారు.